

కాకినాడ జిల్లా డిఇఒగా అన్నపూర్ణ

ప్రజాశక్తి-కాకినాడ



కాకినాడ జిల్లా విద్యాశాఖాధికారిగా కెఎన్‌విఎస్.అన్నపూర్ణ నియమితులయ్యారు. ఈమేరకు పాఠశాల విద్యాశాఖ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. 1984లో విధుల్లో చేరిన ఈమె ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో డీఈవో కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్ గా, ఆర్జెడీ కార్యాలయం, డీఈవో కార్యాలయాల్లో సీనియర్ అసిస్టెంట్ గా బాధ్యతలు నిర్వహించారు. ప్రస్తుతం డైరెక్టరేట్లో డిప్యూటీ డైరెక్టర్గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. రెండు మూడు రోజుల్లో అన్నపూర్ణ కాకినాడ డీఈవోగా బాధ్యతలు చేపట్టనున్నారు. ఇప్పటివరకు జిల్లా విద్యాశాఖాధికారి ఎస్ అబ్రహం కాకినాడ జిల్లాకు ఇంచార్జిగా వ్యవహరిస్తున్నారు.

సిసిసిని పునఃప్రారంభిస్తారా..

- నిలిచిన వివిధ సేవలు
- పునః ప్రారంభానికి చర్యలేవీ..
- వెచ్చించిన రూ.కోట్ల సంగతో..




కమాండ్ కంట్రోల్ సెంటర్

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

కాకినాడ స్మార్ట్ సిటీగా ఎంపికైనా వెంటనే నగరంపై ఎన్నో అంచనాలు ఏర్పడ్డాయి. రూ.వందల కోట్లలో నిధులు ఈ పథకం కింద వస్తుండడంతో ఇప్పటికే ప్లాన్డ్ సిటీగా పేరున్న కాకినాడ సరికొత్త ఆధునికతను సంతరించుకుంటుందని కలలు కన్నారు. అనుకున్నంత వేగం ఆయా పనుల్లో కనిపించలేదన్న నిరాశ ప్రజల్లో నెలకొంది. మరోవైపు స్మార్ట్ సిటీ ప్రణాళికలో ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ (సిసిసి) ఎంతో కీలకం. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి నగర ప్రజలకు ఎన్నో సేవలందించడంలో ఈ సిసిసి ముఖ్య పాత్ర వహిస్తుంది. ఇంత కీలకమైన సిసిసి గత ఏప్రిల్ నెల నుంచి మూతపడింది. ఈ సెంటర్‌ను నిర్వహించే సంస్థకు రూ.కోట్లలో బకాయిలు పేరుకుపోవడంతో ఆ సంస్థ బాధ్యతల నుంచి విరమించుకుని కోర్టును ఆశ్రయించింది. దీంతో ఈ వ్యవస్థ పూర్తిగా నిర్వీర్యమైపోయింది.

కాకినాడ స్మార్ట్ సిటీకి తలమానికంగా నిలిచిన సెంటర్ మూతపడింది. నిర్వహణ బాధ్యతలు చేపట్టిన సైరిటైడ్ సంస్థకు రూ.19.39 కోట్ల బిల్లుల బకాయి ఉండడంతో గత ఏప్రిల్ నెలలో ఆ సంస్థ బాధ్యతలు విరమించుకుని హైకోర్టును ఆశ్రయించింది. బకాయిలు చెల్లింపులు జరిగితే మళ్లీ సిసిసి సేవలు యథావిధిగా మొదలవుతాయని అంతా భావించారు. ప్రస్తుతం స్మార్ట్ సిటీలో నిధులు లేకపోవడంతో ఈ సమస్య పరిష్కారం కాలేదు. దీంతో స్టెరిలైజ్ సంస్థ తనుకు ఆరు నెలల అడ్వాన్స్ ఇస్తే విధులు ప్రారంభిస్తామని స్మార్ట్ సిటీ ఎమ్‌డి, మున్సిపల్ కమిషనర్ కె.రమేష్‌తో చర్చలు జరుపుతోంది. కానీ చర్చలు ఇంకా సఫలం కాలేదు. గత ఏప్రిల్ నుంచి సేవలు నిలిచిపోవడంతో నగరంలోని అనేక సేవలు అస్తవ్యస్తంగా మారిపోయాయని విమర్శలు వస్తున్నాయి. సిసిసి ద్వారా నాలుగు ట్రాఫిక్ సిస్టమ్ ఇంక్షన్స్, 150 సిసి కెమెరాలు, 140 స్మార్ట్ స్ట్రీట్ లైట్లు, 50 ఎస్‌డబ్ల్యుఎం వెహికల్స్ జిపిఎస్, వేరియబుల్ మెస్సేజింగ్ సిస్టమ్స్, 30 పబ్లిక్ ఎనౌన్స్‌మెంట్ సిస్టమ్స్, 470 వైఫై కనెక్షన్ పాయింట్స్, 30 నెట్వర్క్, బేటర్స్, 25 ఎమర్జెన్సీ అలారాలు, 12 ఎన్విరాన్మెంట్ సెన్సార్స్, 10 ఫేస్ రికగ్నేషన్ సిస్టమ్స్, 20 ఆటోమేటిక్ నంబర్ ప్లేట్ రీడర్స్, 10 రెడ్ లైట్ వయలేషన్ డిటక్షన్ సిస్టమ్స్, 10 లాంగ్ రేంజ్ కమ్యూనికేషన్.. ఇలా 14 రంగాలకు సంబంధించిన పనులు దీని ద్వారా కంట్రోల్ చేస్తారు. తొలుత నిర్మాణ నిర్వహణకు రూ.34.88 కోట్ల నిధులను ఎంపికైన వెంటనే కేటాయించారు. ఇందులో సిసిసి నిర్మాణానికి రూ.166.18 కోట్లు, నిర్వహణ కింద అయిదేళ్లకుగాను స్టెరిలైజ్ సంస్థకు రూ.28.40 కోట్లు కేటాయించారు. ఇంత భారీఎత్తున నిధులు వెచ్చించినా సెంటర్‌కు ఇప్పుడు నిర్వహణ వ్యయం చెల్లించకపోవడంతో ఎటువంటి సేవలు అందించకుండా మూసేసి తాళాలు వేసేశారు. అందులో పని చేస్తున్న సిబ్బందిని విధుల నుంచి తొలగించారు. దీంతో వీరంతా అర్ధాంతరంగా రోడ్డున పడ్డారు. ఈ సెంటర్ కోసం నగరంలో మొత్తం 120 కిలోమీటర్ల మేర అండర్ గ్రౌండ్ కేబుల్ వ్యవస్థను ఏర్పాటు చేశారు. దీని ద్వారా నగరంలో జరిగే రోడ్డు ప్రమాదాలు, దొంగతనాలు, చిన్నపిల్లలు తపిపోవడం రోడ్డు జంక్షన్‌లో సిగ్నల్ వ్యవస్థ ఇలా ప్రతి అంశంలో ఎక్కడ ఏ సమస్య వచ్చినా క్షణాల్లో పరిష్కారం లభించేది. ఇవేమీ పని చేయకపోవడంతో నగరంలో రోడ్డు ప్రమాదాలు ఎక్కువవడంతో పాటు దొంగతనాలు సైతం పెరిగిపోయాయని విమర్శలు వస్తున్నాయి. వాస్తవానికి ఐదేళ్ల అనంతరం నగరపాలక సంస్థ సిసిసి నిర్వహణ బాధ్యతలు తీసుకోవాల్సి ఉంది. అయితే ఇప్పుడే ఇలా ఉంటే ముందు ముందు దీని నిర్వహణ మరింత భారంగా మారే అవకాశం ఉండడంతో ఏం. చేయాలో తెలియక అధికారులు తలలు పట్టుకుంటున్న పరిస్థితి కనిపిస్తోంది.

స్మార్ట్ సిటీ మిషన్ డైరెక్టర్ కూనల్ కుమార్ పర్యవేక్షణలో కాకినాడ స్మార్ట్ సిటీ కార్పొరేషన్ లిమిటెడ్ సిఇఒ కె.రమేష్ గోవా సదస్సుకు హాజరయారు. ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్స్ పనితీరు, ప్రయోజనాలు, మరింత సమర్ధవంతంగా నిర్వహించేందుకు తీసుకోవలసిన చర్యలపై గోవా వేదికగా సిఇఒలు అభిప్రాయాలను పంచుకున్నారో లేదో చెప్పలేకపోవడంతో పాటు కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను తెరిచే ఉద్దేశం అధికారులకు, రాజకీయ నాయకులకు ఉందో లేదో తెలియడం లేదంటున్నారు.



మూతపడిన కమాండ్ కంట్రోల్ సెంటర్

జాతీయ మహాసభ పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - తాళ్లరేవు

అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ మహాసభల పోస్టర్‌ను తాళ్లరేవు ప్రజా సంఘాల కార్యాలయం వద్ద వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా కార్యదర్శి కెఎస్.శ్రీనివాస్, అధ్యక్షుడు టేకుమూడి ఈశ్వరరావు మాట్లాడారు. అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం 10వ జాతీయ మహాసభలు ఫిబ్రవరి 15 నుంచి నాలుగు రోజుల పాటు పశ్చిమ బెంగాల్ రాజధాని కలకత్తా నగరంలో జరుగుతున్నాయని, ఈ మహాసభల్లో ఉపాధి హామీ పథకం కూలీల స్థితిగతులు, పేదల పరిస్థితులను సమీక్షించి భవిష్యత్తు ఉద్యమాలు చేపడతారన్నారు. ఉపాధి హామీ పథకానికి కేంద్రం బడ్జెట్లో సుమారు రూ.30 వేల కోట్లు కోత పెట్టిందని, దీన్ని సవరించి రూ.90 వేల కోట్లు కేటాయించాలని లేనిపక్షంలో, ఏప్రిల్ 5న ఢిల్లీలో లక్షలాది మందితో ధర్నా నిర్వహించి కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామన్నారు. ఈ కార్యక్రమంలో దుప్పి అదష్టదీపుడు, మందనక్క తణుకు రాజు, గోడి భాస్కరరావు, నేరేడుమిల్లి త్రిమూర్తులు, చొల్లంగి వెంకటలక్ష్మి, వల్లు రాజుబాబు పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సంఘం జిల్లా నాయకులు

కుటుంబానికి పునాది వివాహ వ్యవస్థ

ప్రజాశక్తి-కాకినాడ రూరల్

రోజువారీ జీవితంలో విశ్వాసం, త్యాగం, ఆనందాన్ని పొందడానికి వివాహం ఉద్దేశించిందని, ఇది కుటుంబ వ్యవస్థకు పునాది వంటిదని న్యాయవాది శ్రీలక్ష్మి పేర్కొన్నారు. సర్పవరం జంక్షన్‌లో న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ప్రపంచ వివాహ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. వివాహం ద్వారా వ్యక్తుల కంటే కుటుంబ అవసరాలకు ప్రాధాన్యత ఉందన్నారు. జీవితాంతం భాగస్వామి పట్ల నిబద్ధతను పునరుద్ధరించడం కంటే అందమైనది మరొకటి లేదన్నారు. వైవాహిక జీవితం ఆనందంగా, విశ్వాసంతో కొనసాగాల్సి ఉండగా నేటి ఆధునిక సమాజంలో వివాహ వ్యవస్థను అపహస్యం చేస్తూ విడాకుల కేసులు పెరుగుతుండడం చాలా బాధాకరమన్నారు. దంపతుల మధ్య సహనం, ఓర్పు లేకపోవడంతో చిన్న చిన్న తగాదాలకు కూడా కోపతాపాలకు గురై పట్టుదలకు పోయి అమూల్యమైన వివాహాన్ని రద్దు చేసుకుంటున్నారని అన్నారు. ఏళ్ల తరబడి ఒంటరిగా జీవిస్తున్నారన్నారు. భార్యాభర్తల మధ్య ఓర్పు, సహనం అవసరమన్నారు. పిల్లల భవిష్యత్తును దష్టిలో పెట్టుకుని సఖ్యతగా మెలగాలన్నారు. అప్పుడే వివాహ వ్యవస్థకు సార్ధకత చేకూరుతుందని శ్రీలక్ష్మి తెలిపారు. ఈ కార్యక్రమం అడబాల రత్నప్రసాద్ అధ్యక్షతన జరిగింది.



మాట్లాడుతున్న అడ్వకేట్ శ్రీలక్ష్మి

బాలికల క్రీడోత్సవాల ముగింపు

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

కాకినాడ స్థానిక రంగరాయ మెడికల్ కాలేజ్ గ్రౌండ్స్‌లో భాష్యం పాఠశాల జోనల్ బాలికల క్రీడోత్సవాలు ఆదివారం ఘనంగా జరిగాయి. ఈ క్రీడోత్సవాలలో, భాగంగా భాష్యానికి చెందిన పది బ్రాంచీలు కాకినాడ 1, 2, 3, సామర్లకోట, ఏలేశ్వరం జగ్గంపేట, రాయవరం, రామచంద్రపురం విద్యార్థులు పాల్గొన్నారు. ఈ క్రీడల్లో భాగంగా జూనియర్, సీనియర్ విభాగాల్లో కబడ్డీ, చెస్, కారమ్స్, త్రోబాల్, టెన్నికాయిట్, షటిల్ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఎన్‌టిఆర్ హెల్త్ యూనివర్సిటీ మెంబర్ ఐవి.రావు, రంగరాయ కళాశాల ప్రిన్సిపల్ నరసింహం విజేతలకు మెడల్స్, మెమెంటోలు అందించారు. విద్యార్థులకు చదువులతో పాటు క్రీడలు ఎంతో అవసరమని చెప్పారు.

ముగిసిన విక్టోరియా క్లబ్ క్రికెట్ టోర్నీ

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

విక్టోరియా క్లబ్ 8వ క్రికెట్ టోర్నమెంట్ కాకినాడ రంగరాయ మెడికల్ కాలేజ్ క్రీడా మైదానంలో ఆదివారంతో ముగిసింది. పది రోజులపాటు జరిగిన ఈ క్రికెట్ టోర్నమెంట్‌లో వచ్చే నగదు మొత్తాన్ని క్రికెట్ ఆడాలనుకునే మధ్యతరగతి యువతకు అందిస్తారు. ఆదివారం ఉదయం రాజమహేంద్రవరం జట్టుకు విక్టోరియా బి-జట్టుకు మధ్య మ్యాచ్ జరిగింది. విక్టోరియా బి జట్టుపై రాజమహేంద్రవరం జట్టు 147 పరుగులు చేయగా విక్టోరియా బి-జట్టు 18 ఓవర్లలో విజయాన్ని అందుకుంది. అనంతరం ముఖ్య అతిథులు మధ్య తరగతి విద్యార్థులకు క్రికెట్ కిట్లను, విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. విజేతలను పలువురు అభినందించారు.



బహుమతి అందుకుంటున్న విజేతలు

జెవివి ఆధ్వర్యంలో దేశభక్తి గీతాల శిక్షణ

ప్రజాశక్తి-కాకినాడ

స్థానిక యుటిఎఫ్ హోమ్‌లో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో రెండు రోజుల దేశభక్తి, అభ్యుదయ గీతాల శిక్షణా శిబిరాన్ని విజయవంతంగా నిర్వహించారు. జెవివి జిల్లా అధ్యక్షుడు కెఎంఎంఆర్ ప్రసాద్, ప్రధాన కార్యదర్శి రామారావు, సాంస్కృతిక విభాగం ప్రతినిధి ఎన్.కన్నబాబు, సమతా కన్వీనర్ ఉమా రాజ మంగతాయారు సుమారు 50 మంది విద్యార్థులు, ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చారు. ప్రజానాట్యమండలి సురేష్ శిక్షణకు హాజరైన విద్యార్థులు, ఉపాధ్యాయులకు గీతాలాపనలో శిక్షణ ఇచ్చారు. శతి లయ సంగతులు మొదలైన సంగీత అంశాల ఆధారంగా పాటలను పాడే విధానాన్ని నేర్పించారు. రెండు రోజుల శిక్షణా కార్యక్రమంలో విద్యార్థులు అనేక పాటలని నేర్చుకున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో జెవివి నాయకులు ఎఎస్.రెడ్డి, ఎం.సుబ్బారావు, యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ప్రభాకర్‌వర్మ, జిల్లా ప్రధాన కార్యదర్శి రవి చక్రవర్తి, డి పద్మనాభం, ప్రజానాట్యమండలి శ్రీనివాస్, సిఐటియు నాయకులు వీరబాబు పాల్గొన్నారు. అనంతరం శాస్త్రవేత్త డార్విన్ జయంతి ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.



శిక్షణ ఇస్తున్న జెవివి నాయకులు



మాట్లాడుతున్న ఎంఎల్ఎ ద్వారంపూడి

ముస్లిముల అభ్యున్నతికి కృషి

ప్రజాశక్తి-కాకినాడ

కాకినాడ నగరంలో ముస్లిముల అభ్యున్నతికి అన్ని విధాలుగా సహకరిస్తామని సిటీ ఎంఎల్ఎ ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి చెప్పారు. ఆదివారం కాకినాడ సినిమారోడ్డులోని పద్మనాభ ఫంక్షన్ హాల్లో జల్సా అజ్మతే ఖుర్ ఆన్, దస్తార్ బందీ కార్యక్రమంలో ఎంఎల్ఎ ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి, రాష్ట్ర వక్ఫ్ బోర్డు డైరెక్టర్ అబ్దుల్ బషీవుద్దీన్, కాకినాడ జిల్లా వక్ఫ్ బోర్డు అధ్యక్షులు రెహమన్ ఖాన్ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో మొత్తం 16 మంది హాఫీజ్‌గా శిక్షణ పొందిన విద్యార్థులకు అతిథులు ఘనంగా సత్కరించి సర్టిఫికెట్స్ అందజేశారు. ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ ఖురాన్ గ్రంథాన్ని ప్రతి ఒక్కరు చదవడమే కాక ఆ గ్రంథాన్ని పూర్తిగా అర్థం చేసుకుని అమలు చేయాలని సూచించారు. ఎంఎల్ఎ ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ నగరంలో తన హయాంలో ఇప్పటికే రెండు కొత్త మసీదులను నిర్మించామని, త్వరలోనే ఈద్గా వద్ద నూతన మసీదు నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మిల్లీ కౌన్సిల్ ప్రధాన కార్యదర్శి ఖాదర్, ఎండి జవహర్ ఆలీ, ఏజాజుద్దీన్, వైసిపి మైనారిటీ సెల్ అధ్యక్షులు ఖాలిద్, జాఫర్‌ఖాన్ పలువురు ముస్లిం ప్రముఖులు పాల్గొన్నారు.

ద్వారబంధాల చంద్రయ్యకు ఘన నివాళి

ప్రజాశక్తి-కాకినాడ రూరల్

ద్వారబంధాల చంద్రయ్య బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా గిరిజన, దళిత, పీడిత వర్గాలను సంఘటితం చేసి పోరాటం చేసిన విప్లవ యోధుడని రిటైర్డ్ తహశీల్దారు రేలంగి బాపిరాజు పేర్కొన్నారు. సర్పవరం జంక్షన్‌లో బోట్ క్లబ్ వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో ద్వారబంధాల చంద్రయ్య వర్ధంతి సందర్భంగా ఆదివారం ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. తుపాకీ కాల్చడం, విలువిద్య, కర్రసాము, గుర్రపు స్వారీలో చంద్రయ్య మంచి ప్రవీణుడని అన్నారు. 1879లో బ్రిటిష్ వారి దోపిడీ, అణచివేతపై తిరుగుబాటు లేవనెత్తాడన్నారు. ఆ సమయంలో అడ్డతీగల పోలీస్ స్టేషన్‌ను ధ్వంసం చేశాడన్నారు. చంద్రన్న బందం పెద్దవ్యాపారుల నుంచి ఆహార ధాన్యాలను, వస్తువులను దోచుకుని కరువుతో అల్లాడుతున్న పేద ప్రజలకు పంచిపెట్టేవారని చెప్పారు. ఆయన ముఖ్య అనుచరులను లోబరుచుకుని ఆహారంలో మత్తుమందు కలిపి బంధించి 1880 ఫిబ్రవరి 12న ఉరితీశారని చెప్పారు. ఈ కార్యక్రమంలో అడబాల రత్న ప్రసాద్, డాక్టర్ కుమార్ యాదవ్, బుద్ధరాజు సత్యనారాయణరాజు, పార్ధసారథి, వరదరాజు, రాఘవరావు, సత్యనారాయణ పాల్గొన్నారు.



నివాళి అర్పిస్తున్న సభ్యులు

ఘనంగా సింహాచలం పుట్టినరోజు

ప్రజాశక్తి-పెదపూడి

సమాజంలో వృద్ధులు పేదలను ఆదుకోవడానికి అందరూ ముందుకు రావాలని పద్మశాలీల సంఘం నాయకుడు, వైసిపి బిసి సెల్ మండల కన్వీనర్ పప్పు సింహాచలం అన్నారు. ఆయన పుట్టినరోజు సందర్భంగా పెదపూడిలో ఆదివారం 150 మంది వృద్ధులు, పేదలకు దుప్పట్లు, చీరలు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల వద్దులను ఆదుకోవడంలో, తమ వంతు సాయం చేయడంలో చాలా తప్తి ఉంటుందన్నారు. ప్రతి ఏడాదీ తమ పుట్టినరోజు సందర్భంగా ఇలాంటి సేవాక్రమాలు విస్తతంగా చేస్తుంటానన్నారు. ఇవే కాకుండా పేద విద్యార్థులు, పేద చిన్నారులు ఆపదలో ఉన్నవారికి నిరంతరం తమ శక్తి మేరకు సేవలందిస్తున్నానన్నారు. గతంలో ఆర్ఎంపి వైద్యం ద్వారా కూడా గ్రామంలో విశేష సేవలు అందించానన్నారు. అనంతరం సింహాచలం సతీమణి కల్పన అంజలి, తల్లిదండ్రులు నాగమణి జోగారావు, సోదరి సీతారత్నం, సోదరుడు శ్రీనివాస్, స్నేహితుడు అమ్మిన పాపారాయుడు పేదలకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సమ్మంగి దుర్గాప్రసాద్, మార్ని వెంకట్రావుచౌదరి, పంపన రమణ, ఇందుకుపల్లి కాటయ్య, గోపి, సురేష్ పాల్గొన్నారు.



దుప్పట్లు, పండ్లు పంపిణీ చేస్తున్న సింహాచలం

లోకేష్ యాత్రకు ఇబ్బందులు సిగ్గుచేటు

ప్రజాశక్తి -కరప

టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ నిర్వహిస్తున్న యువగళం పాదయాత్రకు అడుగడుగునా ఇబ్బందులకు గురి చేయడం సిగ్గుచేటని కాకినాడ రూరల్ మాజీ ఎంఎల్ఎ పిల్లి అనంతలక్ష్మి సత్యనారాయణమూర్తి అన్నారు. యండమూరులో ఆదివారం ఇంటింటికీ మీ అనంతలక్ష్మితో పాటు ఇదేం కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమాలను టిడిపి రాష్ట్ర కార్యదర్శి పిల్లి సత్యనారాయణ మూర్తితో కలిసి ఆమె నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లోకేష్‌ను మాట్లాడనీయకుండా మైకు లాక్కుంటున్నారని, లోకేశ్ భద్రతకు ఇచ్చిన గన్‌మెన్ల కంటే పాదయాత్ర అడ్డుకునేందుకు పోలీసులను ఎక్కువగా నియమించారని చెప్పారు. పాదయాత్రకు వచ్చిన జనాన్ని చూసి పైస్థాయి అధికారుల ఒత్తిడి తట్టుకోలేక కింద స్థాయి సిబ్బంది సతమతం అవుతున్నారన్నారు. వచ్చేది చంద్రబాబు ప్రభుత్వమేనని జగన్ సహా వైసిపి నేతలకు అందరికీ అర్థమయ్యిందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్‌పిటిసి పలివెల జానకిరామయ్య, నురుకుర్తి వీరన్న, పలివెల దుర్గారావు, మేడిశెట్టి విష్ణు, పలివెల రామచంద్రరావు, సుంకర కుమార్, గుర్రాల రాజు పాల్గొన్నారు.



యండమూరులో పర్యటిస్తున్న అనంతలక్ష్మి దంపతులు

కార్టూ'నిజం'



ఎంఎల్‌సి ఎవరిని వరించేనో..

ప్రజాశక్తి - తాళ్లరేవు

రాష్ట్రంలో ఖాళీ అవుతున్న ఎంఎల్‌సి స్థానాలను భర్తీ చేసే నేపథ్యంలో అన్ని పార్టీల్లో ఎంఎల్‌సి పదవుల సందడి మొదలయ్యింది. ప్రధానంగా అధికార పార్టీకి ఎంఎల్ఎ స్థానాల కోటాతో పాటు, స్థానిక సంస్థల కోటా, నామినేటెడ్ పదవుల కోటా అవకాశాలు పుష్కలంగా ఉండడంతో అధిక స్థానాలను కైవసం చేసుకునే అవకాశాలు ఉన్నాయి. వైసిపి 6, టిడిపికి 12, బిజెపికి 3, పిడిఎఫ్ 2, ఇండిపెండెంట్ ఒకటి స్థానాలు మొత్తం 23 నుంచి 24 స్థానాలు ఈ ఏడాది మార్చి నుంచి జూలై మధ్యలో ఖాళీ అవుతున్నాయి. బిసి కోటా నుంచి శెట్టిబలిజలకు ఎంఎల్‌సి స్థానం కేటాయించాలని వైసిపి వర్గాలు ఆలోచిస్తున్న నేపథ్యంలో కోనసీమ ప్రాంతం నుంచి శెట్టిబలిజ సామాజికవర్గంలో మూడు పేర్లు ప్రధానంగా వినిపిస్తున్నాయి. కోనసీమ ప్రాంతంలో అమలాపురం నియోజకవర్గం నుంచి అమలాపురం మున్సిపాలిటీ వైస్ చైర్మన్‌గా చేసిన చెల్లుబోయిన శ్రీనివాస్, ఇటీవల వార్తల్లో ఉన్న వాసంశెట్టి సుభాష్ పేర్లు వినిపిస్తుండగా ముమ్మిడివరం నియోజకవర్గం నుంచి వైసిపి రాష్ట్ర సంయుక్త కార్యదర్శి, ముమ్మిడివరం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కుడుపూడి శివన్నారాయణ పేరు పరిశీలనలో ఉన్నట్లు తెలిసింది. సాధారణంగా కోనసీమ ప్రాంతంలో శెట్టిబలిజ సామాజిక వర్గంలో గతం నుంచి కుడుపూడి ఇంటి పేరుకు ఒక ప్రత్యేక స్థానం ఉంది. గతంలో కుడుపూడి ప్రభాకర్‌రావు, కుడుపూడి చిట్టబ్బాయి, కుడుపూడి సూర్యనారాయణ వీరందరూ కోనసీమ ప్రాంతాన్ని ప్రభావితం చేసిన వారే. అమలాపురం నుంచి మాజీ మంత్రి కుడుపూడి ప్రభాకరరావు తనయుడు కుడుపూడిబాబు ఎంఎల్‌సి కోసం ప్రయత్నం చేస్తున్నారు. ఇప్పటికే బాబు కుటుంబ సభ్యులు అధిష్టానాన్ని కలిసి ఎంఎల్‌సి ఇవ్వాలని కోరినట్లు తెలిసింది. ఇదే కుటుంబానికి చెందిన శెట్టిబలిజ సామాజికవర్గంలో పట్టు ఉన్న నాయకుడు కుడుపూడి సూర్యనారాయణ కాగా కొన్ని అనివార్య కారణాలవల్ల, సూర్యనారాయణ పట్ల వైసిపి అధిష్టానం సుముఖత చూపడం లేదని తెలుస్తోంది. కోనసీమలో చెల్లుబోయిన శ్రీనివాస్‌కు ప్రస్తుత మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకష్ణ అండదండలు ఉండగా, వాసంశెట్టి సుభాష్‌కు రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్ చంద్రబోస్ ఆశీస్సులు ఉన్నాయంటున్నారు. మంత్రులు చెల్లుబోయిన వేణుగోపాలకష్ణ, పినిపే విశ్వరూప్, ఎంపీ సుభాష్ చంద్రబోస్, ముమ్మిడివరం ఎంఎల్ఎ పొన్నాడ వెంకట సతీష్ కుమార్‌తో శివన్నారాయణకు సాన్నిహిత్యం ఉంది. దీంతోపాటు పుదుచ్చేరి మాజీ మంత్రి మల్లాడి కృష్ణారావు అండదండలు సైతం ఆయనకు ఉన్నాయంటున్నారు. దీనికి తోడు ఇటీవల జిల్లాల పునర్విజనలో భాగంగా తాళ్లరేవు మండలం కాకినాడ జిల్లాలో కలవడంతో శివన్నారాయణకు అవకాశం ఇస్తే ఇటు కోనసీమ, అటు కాకినాడ జిల్లాల్లోనూ ప్రభావం ఉంటుందని అధిష్టానం ఆలోచిస్తున్నట్లు సమాచారం. ఈ సమీకరణాలన్నింటినీ మధింపు వేసుకున్న నేపథ్యంలో ఎవరిని ఎంఎల్‌సి పదవి వరిస్తుందో వేచి చూడాల్సిందే.

చొల్లంగిలో పూర్వ విద్యార్థుల కలయిక

ప్రజాశక్తి - తాళ్లరేవు

తాళ్లరేవు హైస్కూల్లో 1985-86లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు చొల్లంగి మడ అడవుల్లో ఆదివారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. మార్చి 12న తాళ్లరేవు శ్రీమతి నామన వెంకాయమ్మ జిల్లా పరిషత్ హైస్కూల్లో కుటుంబ సమేతంగా కలవడానికి నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో రోళ్ల శ్రీనివాస చక్రవర్తి, ఐతంపూడి శ్రీను, రాంబాబు, రాంజీ, మంగామణి, సామ సుజాత, అద్దేపల్లి కమలాదేవి తదితరులు ఉన్నారు.

మహాసభల పోస్టర్, కరపత్రాల ఆవిష్కరణ

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఐఎఫ్‌టియు) రాష్ట్ర మహాసభలు ఈ నెల 25, 26న శ్రీకాకుళంలో జరగనున్న నేపథ్యంలో పోస్టర్లను, కరపత్రాలను ఆదివారం కాకినాడ కచేరి పేటలోని జిల్లా కార్యాలయంలో రాష్ట్ర కార్యదర్శి జె.వెంకటేశ్వర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత మహాసభల నుంచి నేటి మహాసభల వరకు ఐఎఫ్‌టియు చేపట్టిన కార్మిక ఉద్యమాలను సమీక్షించి, భవిష్యత్తు పోరాట కర్తవ్యాలను రూపొందించడానికి రాష్ట్ర మహాసభ నిర్వహిస్తున్నామని చెప్పారు. కేంద్రంలోనూ, రాష్ట్రంలోనూ పాలకవర్గాలు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాట కర్తవ్యాలను రూపొందిస్తామన్నారు. ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా, ప్రభుత్వరంగాన్ని కాపాడుకోవడం కోసం, కార్మిక చట్టాల అమలు కోసం, లేబర్ కోడ్ల రద్దు కోసం, ఉద్యోగ భద్రత కోసం కార్మిక వర్గం సంఘటితంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బంగారు సత్యనారాయణ, పి.బసవయ్య, మాగాపు రాజు, సుబ్రహ్మణ్యం, కె.నరసింహ, నాగమల్లేశ్వరి, ఇ.మనోజ్ పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు



అధికారులుస్వాధీనం చేసుకున్న పిడిఎస్ బియ్యం

రేషన్ బియ్యం స్వాధీనం

ప్రజాశక్తి-రామచంద్రపురం

కె.గంగవరం మండలంలోని సత్యవాడ-నరజాడ రోడ్డులో వద్ద అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని అధికారులు శనివారం రాత్రి స్వాధీనం చేసుకున్నారు. అశోక్ లేలాండ్ దోస్త్ వాహనం లో పిడిఎస్ బియ్యం తరలిస్తారన్న సమాచారంతో విజిలెన్స్, రెవెన్యూ. సివిల్ సప్లయి అధికారులు తనిఖీ చేశారు. వాహనంలో వివిధ రంగుల 43 ప్లాస్టిక్ బస్తాల్లో సుమారు 20 క్వింటాళ్ల పిడిఎస్ బియ్యాన్ని గుర్తించారు. పిడిఎస్ బియ్యాన్ని ఎటువంటి బిల్లులు లేకుండా కె. గంగవరం మండలం సత్యవాడ గ్రామమ నుంచి యానాం ప్రాంతానికి డ్రైవర్ చవ్వాకుల వెంకటేశ్వరరావు తరలిస్తున్నట్లు గుర్తించారు. వీటి విలువ రూ.6,80,000లు ఉంటుందని అంచనా. మొత్తం 20.00 క్వింటాళ్ల రేషన్ బియ్యం సివిల్ సప్లయ్స్ అధికారులు సీజ్ చేసి 6-ఎ కింద కేసు, తరలిస్తున్న వారిపై క్రిమినల్ కేసు నమోదు చేశారు. ఈ తనిఖీల్లో కార్యాలయ ఇనెస్పెక్టర్లు రమేష్, తహాశీల్దార్ విజయకుమార్, హెడ్ కానిస్టేబుల్ జీవానందం, కానిస్టేబుల్ ఈశ్వర్, రెవెన్యూ, సివిల్ సప్లయిస్ అధికారులు పాల్గొన్నారు.



బోల్తా పడిన ఇసుక ట్రాక్టర్

ఇటుక ట్రాక్టర్ బోల్తా.. వ్యక్తి మృతి

ప్రజాశక్తి-రామచంద్రపురం

ఏటిగట్టుపై వెళుతున్న ఇటుక ట్రాక్టర్ ఆదివారం అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో వ్యక్తి మృతి చెందాడు. వివరాలు ఇవి. కోటిపల్లి ఏటిగట్టు నుంచి వెళుతున్న ట్రాక్టర్ నీలగిరి పేట వద్ద గేదెను తప్పించబోయి అదుపుతప్పి బోల్తా పడింది. అందులో ఉన్న నీలా నాగేశ్వర రావు (52) మతి చెందాడు. దీనిపై కె.గంగవరం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



ప్రమాదంలో మృతి చెందిన వ్యక్తి

బస్సు ఢీ కొని వ్యక్తి దుర్మరణం

ప్రజాశక్తి- రామచంద్రపురం

రామచంద్రపురం ఆర్టీసీ కాంప్లెక్స్ అవుట్ గేట్ లో ఆర్టీసీ బస్ ఢీ కొని వ్యక్తి ఆదివారం దుర్మరణం పాలయ్యాడు. పట్టణానికి చెందిన టేకుమూడి సత్యనారాయణ (50) మోటార్ సైకిల్ పై చోడవరం వైపు వెళుతుండగా కాంప్లెక్స్ వద్దకు వచ్చేసరికి బస్సు ఢీ కొంది దీంతో మోటార్ సైకిల్ నడుపుతున్న సత్యనారాయణ అక్కడకక్కడే మతి చెందాడు.రామచంద్రపురం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అగ్ని ప్రమాదంలో గాయపడిన మహిళ మృతి

ప్రజాశక్తి -రామచంద్రపురం

అగ్ని ప్రమాదానికి గురైన మహిళచికిత్స పొందుతూ మృతి చెందింది. మండలం లోని శివల గ్రామానికి చెందిన నిడదవోలు లక్ష్మీ భ్రమరాంబ ఇటీవల నీళ్ల కాస్తూ అగ్ని ప్రమాదానికి గురైంది. ఆమె కాకినాడ ప్రభు త్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసి ఎస్ఐ చిరంజీవి దర్యాప్తు చేస్తున్నారు.

మద్యానికి డబ్బులివ్వలేదని యువకుని ఆత్మహత్య

ప్రజాశక్తి - సీతానగరం

భార్య మద్యానికి డబ్బులివ్వలేదని పురుగు మందు తాగి యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన శనివారం రాత్రి చోటు చేసుకుంది. మునికూడలి గ్రామానికి చెందిన గెడ్డం యేసు (23) మద్యానికి బానిసై సంవత్సరం నుంచి పనికి వెళ్లకుండా ఇంటివద్ద ఉంటున్నాడు. శనివారం మద్యం తాగడం కోసం భార్య డబ్బులు ఇవ్వడం లేదని చుట్టు పక్కల పొలాల్లో రైతులు దాచుకున్న పురుగుల మందు తాగి ఇంటికెళ్లాటు. వాంతులు కావడంతో భార్యతో పురుగులు మందు తాగినట్లు చెప్పాడు. కుటుంబ సభ్యులు వైద్యం నిమిత్తం రాజమండ్రి ప్రభుతాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ అర్థరాత్రి 12 గంటలు దాటిన తరువాత మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ప్రతిష్టాత్మకంగా ఆరోగ్యశ్రీ అమలు

ఆరోగ్యశ్రీ కో-ఆర్డినేటర్ రాధాకృష్ణ





ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకాన్ని జిల్లాలో అర్హులందరికీ సక్రమంగా అమలయ్యేలా చర్యలు తీసుకుంటామని ఆరోగ్యశ్రీ జిల్లా కో ఆర్డినేటర్ పసుపులేటి రాధాకష్ణ అన్నారు. ఈ పథకం కింద జిల్లాలో నిర్వహించిన నవశకం సర్వేలో 16,13,000 మంది లబ్ధిదారులను గుర్తించామన్నారు. వీరిలో మొదటి విడతలో 5,882 ఆరోగ్య శ్రీ కార్డులు పంపిణీ చేశామన్నారు. జనవరి 3వ తేదీ నుంచి ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. గతంలో 1,059 జబ్బుల నుంచి 1,259 రోగాలకు వైద్యసేవలు అందించనున్నామన్నారు. జనవరి 3 తేదీ నుంచి పెంచిన జబ్బులకు ఆరోగ్యశ్రీ వర్తిస్తుందని వివరించారు. ఈ సందర్భంగా ఆయన ప్రజాశక్తికి ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడారు.

ఆరోగ్యశ్రీకి కొత్తగా చేర్చిన ముఖ్యమైన సేవలు ఏమిటి.

జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, కంటికి, చెవికి, ముక్కు, గొంతుక, పీడియాట్రిక్, జెనిటో న్యూరో, సర్జికల్, అంకాలజీ, మెడికల్ అంకాలజీకి సంబంధించిన జబ్బులను ఆరోగ్యశ్రీలో కొత్తగా చేర్చారు.

పాత కార్డులు కూడా చెల్లుతాయా.

ప్రభుత్వం కొత్త కార్డులను జారీ చేస్తోంది. కొత్త కార్డులు ఇచ్చే వరకూ పాత కార్డులు చెల్లుబాటులో ఉంటాయి. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఆరోగ్యశ్రీ కార్డులు అందుతాయి. నవశకం సర్వే ఆధారంగా లబ్ధిదారులను గుర్తించాము. అర్హుల జాబితా ఇప్పటికే గ్రామ,వార్డు సచివాలయాల్లో ప్రకటించారు.

ఇతర ఏయే రాష్ట్రాల్లో ఆరోగ్యశ్రీని విస్తరించారు.

ఆరోగ్యశ్రీ కార్డు ఉంటే చాలు ఇక మన రాష్ట్రంతో బాటు, ఇతర రాష్ట్రల్లో కూడా వైద్య సేవలు పొందవచ్చు. కర్నాటక, తమిళనాడు తెలంగాణా వంటి రాష్ట్రాలతో కలిపి 135 కార్పొరేట్ ఆసుపత్రుల్లో ఉచిత వైద్యం పొందవచ్చు. ఇతర రాష్ట్రాల్లో 130 కార్పొరేట్ ఆస్పత్రుల్లో ఆరోగ్యశ్రీ వర్తిస్తుంది. జిల్లాలో 85 ప్రభుత్వాసుపత్రులు, 86 ప్రైవేట్ ఆసుపత్రుల్లో ఆరోగ్యశ్రీ పథకం కింద వైద్య సేవలు పొందవచ్చు.

మొత్తం ఎన్ని శస్త్రచికిత్సలు చేశారు..

ఇప్పటివరకు జిల్లాలో మొత్తం 4,91,833 ఆరోగ్యశ్రీ శస్త్రచికిత్సలు చేశారు. వీటికి ప్రభుత్వం నుంచి రూ.1,280.26 కోట్లు ఖర్చు చేశారు. జిల్లాలో ఇప్పటివరకు 3,429 హెల్త్ క్యాంపులు నిర్వహించారు. వీటిద్వారా 6,62,578 మంది ఉచితంగా వైద్య పరీక్షలు చేయించుకున్నారు. 16,838 మందిని ఆరోగ్యశ్రీ ఆసుపత్రులకు రెఫర్ చేశారు

వైయస్సార్ ఆసరా ప్రయోజనాలేమిటి..

డాక్టర్ వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ పథకం శస్త్ర చికిత్సలు చేకున్న వారికి వైఎస్ఆర్ ఆసరా క్రింత పోషణ ఖర్చుల కోసం రూ.225 నుంచి రూ.5 వేల వరకు ఆర్థిక సాయం ప్రభుత్వం నేరుగా లబ్దిదారుల బ్యాంకు ఖాతాల్లో జమ చేయనుంది. ఆరోగ్యశ్రీ పథకంలో రోగులకు డాక్టర్ల వైద్య పరీక్షలు, వ్యాధి నిర్ధారణ పరీక్షలు (రక్తపరీక్షలు) శస్త్ర చికిత్సలు, ఉచితంగా మందులు పంపిణీ, ఉచిత భోజనం, వసతి, ఆసుపత్రులు రానుపోను రవాణా ఖర్చులు ఇవ్వనున్నారు.

తాళ్లరేవులో ఎన్నికల కోడ్ అమలు

ప్రజాశక్తి - తాళ్లరేవు

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో ఎంఎల్‌సి ఎన్నికల సందర్భంగా అధికారులు ఎన్నికల కోడ్ అమలు చేస్తున్నారు. ఈ సందర్భంగా పలు రాజకీయ నాయకుల విగ్రహాలకు ముసుగులు వేయడంతో పాటు మండలంలోని పలు ప్రాంతాల్లో ఫ్లెక్సీలు తొలగిస్తున్నారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా నుంచి స్థానిక సంస్థల కోటాలో శాసనమండలికి ఎన్నికైన చిక్కాల రామచంద్రరావు పదవీకాలం ఈ ఏడాది మే1తో ముగియనుంది. ఈ స్థానంలో ఎన్నిక కోసం గురువారం నోటిఫికేషన్ జారీ చేసిన సంగతి విదితమే. దీంతో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో ఈ నెల 9వ తేదీ నుంచి ఎన్నికల ప్రవర్తన నియమావళి అమల్లోకి వచ్చింది. ఫిబ్రవరి 16న నోటిఫికేషన్ జారీ అవుతుంది. ఈనెల 23 వరకు నామినేషన్లు స్వీకరించినున్నారు. 24న నామినేషన్ల స్క్రూట్నీ జరుగుతుంది. 27 వరకు నామినేషన్లు ఉపసంహారణకు గడువుగా పేర్కొన్నారు. మార్చి 13వ తేదీ ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరుగుతుంది. మార్చి 16న ఎన్నికల ఓట్లు కౌంటింగ్ జరుగుతుంది. మార్చి 21తో ఎన్నికల నోటిఫికేషన్ పూర్తవుతుంది .అప్పటివరకు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఎన్నికల కోడ్ అమల్లో ఉంటుంది.

వైద్యశిబిరం నిర్వహణ అభినందనీయం

ప్రజాశక్తి - కడియం

పుట్టిన రోజును పురస్కరించుకుని కుటుంబ సభ్యులు, బంధుమిత్రుల మధ్య అట్టహాసంగా నిర్వహించుకోకుండా ఉచిత వైద్య శిబిరం ద్వారా ప్రజలకు వైద్య సేవలు అందించడం అభినందనీయమని ఎంపీ మార్గాని భరత్‌రామ్ అన్నారు. ఆదివారం వేమగిరిలో వైసిపి రాష్ట్ర కార్యదర్శి రావిపాటి రామచంద్రరావు పుట్టినరోజు సందర్భంగా ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంపీ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. తొలుత రావిపాటి రామచంద్రరావుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. కిమ్స్, బొల్లినేని వైద్యులు, అకిరా నేత్ర వైద్యులు ఈ వైద్య శిబిరంలో ప్రజలకు వివిధ రకాల వైద్య సేవలు అందించారు. వైద్యపరీక్షలను నిర్వహించామని శస్త్రచికత్సలు అవసరమైన వారికి తమ ఉచితంగ చేస్తామని వైద్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షులు వై.స్టాలిన్, భీమిరెడ్డి నాగేంద్ర, ఈలి గోపాలం పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల కలయిక

ప్రజాశక్తి - పెద్దాపురం



సమావేశమైన పూర్వ విద్యార్థులు

పెద్దాపురం లూథరన్ హైస్కూల్లో 1982లో 10వ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు 41 సంవత్సరాల అనంతరం ఆదివారం లూథరన్ హైస్కూల్లో కలుసు కున్నారు. తమ విద్యార్థి దశలో జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యా యులను సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఎక్కడెక్కడో స్థిరపడిపోయిన తాము 40 ఏళ్ల క్రితం తాము చదువుకున్న స్కూల్లో కలుసుకోవటం చాలా ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు కట్టా వెంకటరావు, తిప్పాని శ్రీనివాస్, శంకర్, పైడిపల్లి సూర్యనారాయణ మూర్తి, వేదుల సుబ్రహ్మణ్యం (మణి), రియాజ్ పాషా పాల్గొన్నారు.

హైవేను గ్రామం వెలుపలకు మళ్లించాలి

ప్రజాశక్తి - గోపాలపురం

జీలుగుమిల్లి నుంచి కొవ్వూరు వెళ్లే నేషనల్ హైవేను దొండపూడి గ్రామం బయట నుంచి మళ్లించాలని ఆ గ్రామానికి చెందిన వైసిపి మండల అధ్యక్షులు పోతిరెడ్డి నాగరాజు, గ్రామ కమిటీ అధ్యక్షులు పోల్నాటి సురేష్, గ్రామ పెద్దలు ఎంపీ మార్గాని భరత్, ఎంఎల్ఎ తలారి వెంకట్రావులకు వినతిపత్రాలు అందించారు. ఎంపీ, ఎంఎల్ఎలను వారు ఆదివారం కలిశారు. వారు మాట్లాడుతూ జీలుగుమిల్లి నుంచి కొవ్వూరు వెళ్లే నేషనల్ హైవే రోడ్డు మండలంలోని దొండపూడి గ్రామం శివారు సాగిపాడు నుంచి దొండపూడి శివారు వరకు సుమారు రెండు కిలోమీటర్ల మేర వెళ్లనుందన్నారు. ఈ రహదారిని గ్రామంలో నుంచి వేస్తున్నారన్నారు. దీని వల్ల దొండపూడి గ్రామంలో చాలామంది నివాసాలను కోల్పోతారన్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని దొండపూడి గ్రామం దాటే వరకు సుమారు రెండు కిలోమీటర్లు బైపాస్ రోడ్డు వేయాలని కోరినట్లు తెలిపారు.



చిన్నారులకు కిట్లు అందజేస్తున్న సర్పంచ్ శ్రీ దుర్గ, వెంకన్న నాయుడు

చిన్నారులకు పౌష్టికాహారం పంపిణీ

ప్రజాశక్తి-ఉప్పలగుప్తం

గొల్లవిల్లిలో హెచ్ఐవి బాధిత చిన్నారులకు ఆదివారం పౌష్టికాహార కిట్లను పంపిణీ చేశారు. జన కల్యాణ్ వెల్ఫేర్ సొసైటి ఆధ్వర్యంలో డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా వికలాంగుల సంక్షేమ సంఘం అధ్యక్షులు, వైసిపి నాయకులు వంటెద్దు వెంకయ్య నాయుడు, కె.రిష్విక్, కె. ప్రసన్న, జి.చంద్రశేఖర్, జల్లి సుజాత, కె.ధీరజ్‌ల సహకారంతో ఈ కిట్లు అందజేశారు. ముందుగా చిన్నారులతో కేక్ కటింగ్ చేయించి వారిలో మనో ధైర్యం నింపారు. సర్పంచ్ జొన్నాడ శ్రీదుర్గ, నాయకులు మద్దింశెట్టి సీతారామస్వామి, సలాది శివాజి, సలాది పట్టాభి, దూలం శ్రీనివాసరావు, సుంకర బుజ్జి, చప్పిడి దుర్గారావు, పోలిశెట్టి వీరబాబు, నందుల ఏసుబాబు, సలాది రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

పేకాట స్థావరాలపై పోలీసుల దాడి

ప్రజాశక్తి -యంత్రాగం

పలుచోట్ల ఆదివారం పేకాట శిబిరాలపై పోలీసులు దాడులు నిర్వహించారు. నగదును స్వాధీనం చేసుకుని పలువురిని అరెస్ట్‌చేశారు. వివరాలు ఇవి..

మండపేటమండలంలోని ద్వారపూడి శివారు వేములపల్లిలోని పేకాట శిబిరంపై రూరల్ పోలీసులు ఆదివారం దాడి చేశారు. పేకాడుతున్న నలుగురు వ్యక్తులను అదుపులోనికి తీసుకొని వారి వద్ద నుంచి రూ.1,32,700 స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ బి.శివకష్ణ తెలిపారు. **సామర్లకోట** స్థానిక సంపంగి తోటలోని పేకాట నిర్వహిస్తున్నారన్న సమాచారంతో ఆదివారం సామర్లకోట సిఐ కె.దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.6,360 నగదును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు సిఐ కె.దుర్గాప్రసాద్ తెలిపారు.



ఆర్థిక సాయం అందజేస్తున్న జనసేన నాయకులు

మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి -ఉప్పలగుప్తం

ఇటీవల కూనవరానికి చెందిన జనసేన పార్టీ క్రియాశీల కార్యకర్త కొప్పిశెట్టి రామస్వామి ప్రమాదవశాత్తు మృతి చెందాడు. ఆ కుటుంబానికి ఆదివారం జనసేన పార్టీ రూ.20 వేల ఆర్థిక సాయం అందించింది. అలాగే గోపవరం కు చెందిన నాగాబత్తుల ప్రసాద్ కిడ్నీ వ్యాధితో బాధపడుతుండగా ఆ కుటుంబానికి రూ.15 వేలు ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు ఇసుకపట్ల రఘుబాబు, అయితాబత్తుల ఉమామహేశ్వరరావు, ఉండ్రు భగవాన్ దాస్,ఆకుల సూర్యనారాయణ మూర్తి, లింగోలు పండు,సాకా రాంబాబు, అయితాబాత్తుల కష్ణారావు, కొప్పుల నాగమానస, బసవా చినబాబు, గాలి నారాయుడు,తిక్కా, శేషబాబు, వాకపల్లి వెంకటేశ్వర రావు, ఆకుల శ్రీనివాసరావు,బండారు వెంకన్నబాబు, తదితరులు పాల్గొన్నారు.

డంపింగ్ యార్డులుగా రహదారులు, కాలువగట్లు

దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్న ప్రజలు

ప్రజాశక్తి -మండపేట



బైపాస్ రోడ్డులో పేరుకు పోయిన చెత్తా చెదారం

మండపేట పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో స్వచ్ఛభారత్, స్వచ్ఛ సర్వేక్షణ్, మనం-మన పరిశుభ్రత, వ్యర్థాలపై వ్యతిరేక పోరాటంతోపాటు పారిశుద్యంపై అవగాహన వంటి ఎన్నో కార్యక్రమాలు నిర్వహిస్తున్నా మెరుగుపడటం లేదు. సమస్య నానాటికీ తీవ్ర రూపం దాలుస్తోంది. ఆహ్లాదకంగా ఉండాల్సిన రహదారులు, కాలువ గట్లు డంపింగ్‌యార్డులుగా మారి దుర్గంధం వెదజల్లుతున్నాయి. దీంతో తాము వ్యాధులబారిన పడుతున్నామని స్థానికులు, ప్రయాణీకులు వాపోతున్నారు. ఇవి కుక్కలకు, పందులకు, దోమలు, క్రిమికీటకాలకు ఆవాసాలుగా మారుతుండటంతో రాత్రి సమయాల్లో దోమలు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నారు. స్థానిక బైపాస్, ఇందిరాగాంధీ రోడ్డులతో పాటు మండలంలోని వెలగతోడు, తాపేశ్వరం, అర్తమూరు తదితర గ్రామాల్లో రోడ్ల, కాలువల వెంబడి ఉన్న చెత్తాచెదారాలతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులెదుర్కొంటున్నారు. స్థానిక పెద్ద కాలువ వంతెన సమీపంలోను రహదారి వెంబడి చెత్తను వేయడంతోపాటు ఆ చెత్తకు నిప్పు పెడుతుండటంతో ఆ రోడ్లపై ప్రయాణించే వారు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ప్రభుత్వాలు, పాలకులు, అధికారులు మారుతున్నా సమస్యల పరిష్కారానికి నోచుకోవడంలేదని పలువురు విమర్శిస్తున్నారు. మూతపడ్డ చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను తెరిచి, చెత్తను అక్కడికి తరలించాలని కోరుతున్నారు. పచ్చదనం, పరిశుభ్రతను కాపాడే విధంగా అధికారులు సత్వరమే చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు.



పెద్ద కాలువ వంతెన సమీపంలో చెత్త



రాజరత్న రోడ్డులో పేరుకుపోయిన చెత్త



కార్యక్రమం లో పాల్గొన్న టిడిపినాయకులు

కాకరపర్రులో 'ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి'

ప్రజాశక్తి - పెరవలి

పెరవలి మండలంలోని కాకరపర్రులో టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బూరుగుపల్లి శేషారావు ఆదేశాలతో ఆదివారం గ్రామంలో ఇదేం కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికీ తిరిగి జగన్ ప్రభుత్వం పేదలపై వేస్తున్న భారాలను వివరించారు. కరెంటు బిల్లులు, ఆర్‌టిసి ఛార్జీలు, నిత్యావసర వస్తువుల ధరలు, గ్యాస్ పెట్రోలు డీజిల్ వంట నూనె ధరలు విపరీతంగా పెంచి పేద ప్రజలపైభారం మోపారని చెప్పారు. అనంతరం నాయకులు ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు అతికాల వెంకట రామకష్ణమ్మ, సంగీత జయరాజు, బొడ్డు రామాంజనేయులు, అబ్బిశెట్టి సత్తిరాజు, వాకలపూడి వీర్రాజు, సలాది కష్ణమూర్తి, గుడాల నాగ మురళీకృష్ణ, మాణికిరెడ్డి, మురళీకష్ణ, బూరుగుపల్లి, నారాయణరావు, అనపర్తి సత్యనారాయణ, అనపర్తి సాంబమూర్తి, కంటిపూడి సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

ఆయిల్ ఫ్యాక్టరీ యాజమాన్యానికి రిమాండ్

ప్రజాశక్తి-సామర్లకోట

జి.రాగంపేట అంబటి సుబ్బన్న అండ్ కో ఆయిల్స్‌లో ఏడుగురు కార్మికుల మరణం ఘటనలో ముగ్గురు నిందితులను ఆదివారం పెద్దాపురం అడిషనల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ ముందు హాజరు పరిచారు. వారికి ఆయన 14 రోజుల రిమాండ్ విధించారు. వారిని పెద్దాపురం సబ్ జైలుకు తరలించినట్లు పెద్దాపురం పోలీసులు తెలిపారు.

16న పెద్దాపురంలో చంద్రబాబు పర్యటన


ప్రజాశక్తి - పెద్దాపురం

టిడిపి జాతీయ అధ్యక్షులు చంద్రబాబు నాయుడు తూర్పుగోదావరి జిల్లా పర్యటనలో భాగంగా 16న పెద్దాపురం నియోజకవర్గ పరిధిలోని జె.తిమ్మాపురం గ్రామంలో ప్రవేశిస్తారని ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప తెలిపారు. జె.తిమ్మాపురంలో నియోజకవర్గ పరిధిలోని నాయకులు కార్యకర్తలు ఆయనకు భారీ స్వాగతం పలుకుతారన్నారు. పర్యటనలో భాగంగా కట్టమూరు సెంటర్‌కు చేరుకుంటారని, అక్కడ కట్టమూరు గ్రామ టిడిపి నాయకులు, కార్యకర్తలు స్వాగతం పలుకుతారన్నారు. సాయంత్రం 5 గంటలకు పెద్దాపురం కొత్తపేట ఎన్టీఆర్ సర్కిల్ వద్ద పట్టణ నాయకులు, కార్యకర్తలు స్వాగతం పలుకుతారన్నారు. అనంతరం దర్గా సెంటర్, వెంకటేశ్వర స్వామి గుడి సెంటర్, మెయిన్ రోడ్డు మీదుగా సామర్లకోట చేరుకుంటారన్నారు.

స్కూల్ గేమ్స్ పోటీల్లో సునయన సత్తా

ప్రజాశక్తి-కాకినాడ

రాష్ట్ర స్థాయి ఈత పోటీల్లో రాణించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన కాకినాడ విద్యార్థిని పిఎస్ఆర్ఎస్.దీప్తి సునయన మరోసారి సత్తా చాటింది. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్‌జిఎఫ్‌ఐ) ఆధ్వర్యంలో జరిగిన పోటీల్లో పతకం సాధించింది. అండర్ 17 బాలికల 400 మీటర్ల ఫ్రీ స్టైల్ ఈత పోటీల్లో కాంస్య పతకం గెలిచింది. 100 మీటర్ల విభాగంలోనూ తృతీయ స్థానంలో నిలిచి, పతకం సాధించింది. కష్ణా జిల్లా ఈడుపుగల్లులో జరిగిన పోటీల్లో సునయన విజయం సాధించడం జిల్లాకు గర్వకారణమని డైవ్ ఇన్ స్విమ్ కోచ్ అశోక్ అన్నారు. సెయింట్ జోసెఫ్ స్కూల్లో పదో తరగతి చదువుతున్న ఆమె విజయం సాధిస్తుండడం ఆనందంగా ఉందని తల్లిదండ్రులు శివ ప్రసాద్ వర్మ, అర్చన సంతోషం వ్యక్తం చేశారు.



బషీర్ బీబీని దర్శించుకున్న ఎస్‌పి

బషీర్ బీబీని దర్శించుకున్న ఎస్‌పి

ప్రజాశక్తి -యు.కొత్తపల్లి

పొన్నాడ గ్రామంలో ఉన్న బషీర్ బేబీ ఆలయాన్ని కాకినాడ జిల్లా ఎస్‌పి రవీంద్రబాబు దర్శించుకున్నారు. ఆదివారం చివర రోజు కావడంతో ఎస్‌పి స్వయంగా భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. బీబీని సందర్శించేందుకు రాష్ట్రం నుండే కాకుండా ఇతర రాష్ట్రాల నుండి అనేకమంది మతాలకు అతీతంగా హాజరవుతారు. ఎస్‌పి వెంట పిఠాపురం సిఐ శ్రీనివాసరావు, కొత్తపల్లి ఎస్సై రామలింగేశ్వరరావు పలువురు ఎస్సైలు సిబ్బంది పాల్గొన్నారు.